

భీమవరం
గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 26.0
తణుకు : 32.0 - 26.0



• మా పెద్ద కొడుకు



మా ఇంటికి పెద్ద కొడుకు చంద్రబాబు నాయుడు కాబట్టే నాకు ఈ నెల ఏకంగా 7 వేల రూపాయలు చేతిలో పెట్టారు. ఇది నిజమా అని నమ్మలేకపోయాను. మాలాంటి వృద్ధులను ఆదుకునేది చంద్రబాబు నాయుడే.. మేము ఎప్పటికి ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- సరిపల్లి జానకమ్మ, కోడేరు

• గొప్ప విషయం



గత ప్రభుత్వం రెండు నుంచి మూడు వేలకు పెన్షన్ పెంచేందుకు ఐదేళ్ల పట్టింది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాకుండా ఏప్రిల్, మే, జూన్ నెలల సొమ్ము కలిపి ఇవ్వడం చాలా గొప్ప విషయం.

- మర్లపూడి శాంతకుమారి, ఇరగవరం

• పేదల దేవుడు బాబు



పేదల దేవుడు చంద్రబాబు. ఎరియర్స్ ఉద్యోగులకు మాత్రమే ఇస్తారు అటువంటిది నేడు చంద్రబాబు మూడు నెలల ఎరియర్స్ మాకిచ్చి పెద్దకొడుకైనాడు. చీకటి రోజులు పోయి ప్రజలకు మంచి రోజులు వచ్చాయి.

-మంగతాయారు, వితంతువు, ఆకివీడు

పింఛన్ల పంపిణీ సాగిందిలా..

మండలం	మొత్తం	ఇచ్చినవి	శాతం
పాలకొల్లు(అర్బన్)	5967	5754	96.42
పాలకొల్లు(రూరల్)	9215	8919	96.78
నరసాపురం (అర్బన్)	5764	5516	95.75
నరసాపురం (రూరల్)	11235	10874	96.79
మొగల్తూరు	10786	9879	91.74
ఆచంట	8205	6771	82.56
పెనుగొండ	8880	8196	92.14
యలమంచిలి	10472	9849	94.14
వీరవాసరం	8706	8133	93.4
పెనుమంట్ర	8387	7552	90.24
పోడూరు	8705	8157	93.69
భీమవరం	11477	10851	94.51
భీమవరం(అర్బన్	11384	10828	95.12
పాలకోడేరు	9290	8532	91.84
ఉండి	8944	8404	94.1
కాళ్ళ	8975	8557	95.35
ఆకివీడు	3293	2884	87.9
ఆకివీడు (టౌన్)	5468	5089	93.31
తణుకు (రూరల్)	9019	8625	95.58
తణుకు(అర్బన్)	8651	8367	96.74
అత్తిలి	9644	9188	95.19
ఇరగవరం	9535	9257	97.0
తాడేపల్లిగూడెం(అర్బన్)	9389	9033	96.24
తాడేపల్లిగూడెం(రూరల్)	12646	12228	96.68
పెంటపాడు	9956	9530	95.79
గణపవరం	8892	8461	95.1
	2,32,885	2,19,434	94.27



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

అవగాహనతోనే అతిసారకు చెక్

కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 1: అతిసార వ్యాధిని అవగాహన ద్వారానే అరికట్టవచ్చునని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. డయేరియాను అరికట్టేందుకు సోమవారం నుంచి వచ్చేనెల 30 వరకు జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సోమవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అతిసార వ్యాధిని అదుపు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామని ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ప్రతిరోజూ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, పిల్లల ఆరోగ్యంపై ఆరా తీయాలని, అవసర మైనవారికి ఓఆర్ఎస్, జింకు మాత్రలను పంపిణీ చేయడంతో పాటు, వారికి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా తాగునీరు కలుషితం అవ్వకుండా చూడాలని, రక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. కలెక్టరేట్‌లో స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్ల పంపిణీని ప్రారంభించారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, కెఆర్ ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు, డీసీహెచ్ఎస్ సూర్య నారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధా లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఐసీడీఎస్, వైద్య శాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల హడావుడి లేదు.. రోజు ముందుగానే ఆర్భాటమూ లేదు.. పింఛన్ కోసం మూడు రోజులు వెయిట్ చేయనక్కర్లేదు.. కూటమి ప్రభుత్వంలో పింఛన్‌ల పంపిణీ ఒక పండగలా సాగింది. పేద జనం చిరునవ్వులు.. ఆత్మీయ ఆలింగనాలు, పాదాభివందనాలు, పాలాభిషేకాలు, పూలజల్లుల మధ్య సందడిగా సోమవారం ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు పెన్షన్ల పంపిణీ సాగింది. పింఛన్ అందుకున్న వారిలో అత్యధికులు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

బాబు.. బంగారం

పెన్షన్ లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం



జిన్నూరులో దివ్యాంగ బాలుడికి పెన్షన్ అందజేస్తున్న మంత్రి రామానాయుడు

తెల్లవారుజాము నుంచే పండగలా పెన్షన్ల పంపిణీ

నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

తొలి హామీ నెరవేరడంతో కూటమి కార్యకర్తల్లో జోష్

సోమవారం రాత్రికి 95 శాతం పూర్తి

భీమవరం టౌన్, జూలై 1 :పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఊరూ వాడా సందడి నెలకొంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తొలి హామీని నెరవేర్చింది. సోమవారం ఉదయం 6 గంటల నుంచే ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. జిల్లావ్యాప్తంగా తొలిరోజే 95 శాతం మందికి పంపిణీ పూర్తిచేశారు. జిల్లాలో 2 లక్షల 32 వేల 885 మంది పెన్షన్ దారులు ఉండగా సోమవారం రాత్రికి 2 లక్షల 19 వేల 434 మందికి అందించారు. ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు అంతా పంపిణీలో భాగస్వాములయ్యారు. పెన్షన్‌లు అందుకున్న వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల్లో ఆనందం వెల్లివెరిసింది. మంగళవారం ఉదయం మిగిలిన వారికి అందించనున్నారు. పింఛన్‌లు అందుకున్న వారంతా తమ కృతజ్ఞతను ఏదో రూపంలో వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు.

ఎక్కడికక్కడ ఆదరాభిమానాలు

కూటమి ప్రభుత్వంలో సోమవారం నుంచి ఆరంభమైన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ జిల్లాలో సాఫీగా సాగింది. పెరిగిన పింఛన్ పేద ప్రజల మనసు మురిసేలా చేసింది.మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు, పవన్ అంటూ స్థానిక ఎమ్మెల్యేలకు అభివాదాలు చేస్తూ వారిని పొగడ్తలతో ముంచెత్తారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ అధికారులతో పాటు పాల్గొన్నారు. ప్రత్యేకించి వయో వృద్ధులు, మంచం పట్టిన వారు, తలసేమియా, పక్ష వాతంతో బాధపడుతున్న వారందరి దగ్గరకు వెళ్లి మరీ పెన్షన్లు అందించారు. యలమంచిలి మండలం అడవిపాలెంలో మంత్రి నిమ్మల రామానాయుడు వృద్ధురాలికి కాళ్లు కడిగి పెన్షన్ అందించారు. భీమవరంలో పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), ఆచంటలో పితాని సత్యనారాయణ, ఉండిలో కనుమూరు రఘురామకృష్ణరాజు, నరసాపురంలో బొమ్మిడి నాయకర్, తణుకులో ఆరిమిల్లి రాధాకృష్ణ, పెంటపాడులో బొలిశెట్టి శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి పెన్షన్ అందించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి పాలకోడేరు మండలంలో పెన్షన్ పంపిణీ చేశారు. భీమవరం రూరల్ మండలంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తదితరులు పెన్షన్‌లు పంపిణీ చేశారు. తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వలవల బాబ్జీ చంద్రబాబుకు పాలాభిషేకం చేశారు. జిల్లాలో 2,32,885 మంది పెన్షన్‌దారులకు 155.71 కోట్లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయంగా సోమవారం రాత్రికి 95 శాతం పూర్తయింది. వృద్ధులకు ఎరియర్స్‌తో కలిపి ఏడు వేల రూపాయలు అందించారు.



ఆచంటలో పింఛన్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ



భీమవరంలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు



పిప్పరలో పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



చెరుకుమిల్లిలో పాల్గొన్న ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు



గొంది గ్రామంలో దివ్యాంగునికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే నాయకర్, పొత్తూరి



పెంటపాడులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



రేలంగిలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

పేదల సంక్షేమమే మా లక్ష్యం

• దివ్యాంగులకు, వృద్ధులకు ఎంత చేసినా రుణం తీర్చుకోలేం. అన్న మాట ప్రకారం విడతల వారీగా కాకుండా ఒకేసారి పింఛన్ పెంచుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మానవత్వం చాటుకున్నారు. వైసీపీ పాలనలో విడతల వారీ పింఛన్ పెంపుతో వృద్ధులు, వితంతువులు 30 వేలు నష్టపోయారు. అన్నివర్గాలతోపాటు వీరిని మోసం చేసిన ప్రభుత్వం జగన్‌ది.

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

• కుల, మతాలకతీతంగా పేదల సంక్షేమం, అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు స్వస్తి పలికారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారు.

- ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

• పేదరికం లేని సమాజ రూపకల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఏప్రిల్ నుంచి పెంచిన మొత్తాన్ని అమలు చేస్తామని మేనిఫెస్టోలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఏరియర్స్‌తో కలిపి ఏడు వేల రూపాయల పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నాం.

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

• దేశంలో సంక్షేమ పథకాలకు ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్. ఆయన పేరిట పేదలకు పింఛన్లు అందజేయడం సంతోషకరం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని సీఎం చంద్రబాబు అమలు చేయడంతో పింఛనుదారుల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆయన పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారు.

- ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు

• కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటింటా పింఛన్లు ఉండవని గత ప్రభుత్వం చేసింది అసత్య ప్రచారమని ప్రజలకు అర్థమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తాం. ఇక నుంచి ప్రతి నెల 1న ఇదే తరహాలో పింఛన్లు పంపిణీ చేస్తాం.

- నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

• అర్హులకు పింఛన్లు ఇవ్వడం మన బాధ్యత. వీటిని ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌ది అయితే.. ఇస్తున్న మొత్తాలను రెట్టింపు చేసిన ఖ్యాతి మాత్రం సీఎం చంద్రబాబుదే. కూటమి ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

• వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్హులను తొలగించి, అనర్హులకు పెన్షన్లు అందించారు. మేం అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తాం. అన్ని వర్గాల వారికి ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించేందుకు ఆయా సామాజిక వర్గాల వారీగా యువతకు ఉపాధి చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

ప్రజా ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలి : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 1 : ప్రజా ఫిర్యాదులకు సత్వరమే పూర్తి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం ఉండాలన్నారు. వచ్చిన ఫిర్యాదు మళ్లీ రావడం ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి మన మీద ఎంత నమ్మకంతో ఫిర్యాదులను తీసుకు వస్తారని వారి నమ్మకం ఏ మాత్రం సడలని విధంగా ఖచ్చితమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఈ రోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా 107 ఫిర్యాదులను అందుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ,వార్డు సచివాలయాల అధికారి అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వచ్చిన కొన్ని ఫిర్యాదులు పరిశీలిస్తే తన తండ్రి ఉమ్మడి ఆస్తి 2 ఎకరాల 24 సెంట్లు భూమి తన అన్నయ్య ఒక్కడే అను భవిస్తున్నాడని, తన వాటాగా రావలసిన భూమిని ఇప్పించాలని భీమవరానికి చెందిన నక్క భావన కోరింది. నవుడూరు సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలని వీరవాసరం మండలం కొణితివాడకు చెందిన చింతపల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఆక్రమణల వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.



బాధితుల గోడు వింటున్న కలెక్టర్ నాగరాణి



న్యాయం చేసేందుకు ఎప్పుడూ సిద్ధమే : ఎస్పీ

భీమవరం క్రైం, జూలై 1 : ప్రజల సమస్యలపై ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే వాటిపై చట్టప్రకారం విచారణ జరిపి పరిష్కరించడానికి పోలీస్ శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు విన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీచేశారు. కుటుంబ కలహాలు, భర్త/అత్తింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలు, ఇతర సమస్యలపై వినతులు వచ్చాయి. జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) భీమారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లు ప్రారంభం

తొలి రోజు ప్రత్యేక కేటగిరిలో 48 మంది సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు టౌన్, జూలై 1: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌కు అడ్మిషన్ల ప్రక్రియను సోమవారం నుంచి ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ ప్రారంభించారు. తొలి విడతగా ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను అధికారులు నిర్వహించారు. సైనిక సంతతి విభాగానికి చెందిన 48 మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సైనిక సంతతి విభాగం కేటగిరిలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

హెచ్‌ఎంలకు టెక్ టూల్ పై శిక్షణ

ఏలూరు రూరల్, జూలై 1: నూతనగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతోంది. ముఖ్యంగా విద్యారంగంలో సపోర్టింగ్ ఆంధ్రా, లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులో భాగంగా హైస్కూల్, యూపీ పాఠశాల హెచ్‌ఎంలు, సీఆర్పీలకు ఈ నెల 10 వరకు టెక్ టూల్ పై శిక్షణ అందజేస్తుంది. దీనిలో భాగంగా ఏలూరులో సోమవారం శిక్షణ ప్రారంభమైంది. ఎంఈవో-2 రంగయ్య శిక్షణ ప్రారంభించారు. ఏలూరు జిల్లా ప్రతినిధి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ ఎడ్యుకేషనిస్ట్‌తో ఈ కార్యక్రమం రూపకల్పన చేయటం జరిగిందని తెలిపారు. ఇది ఆంధ్రాలో అమలు చేయటం గమనార్హం అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఏఎల్పీ టెక్ టూల్ శిక్షణకు సంబంధించిన నిబంధనలు వివరించారు.

• భలే చెప్పారు.. బహుమతి గెలుచుకున్నారు



ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోల్స్‌లో సరిగా అంచనా వేసి.. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి సోమవారం తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి కార్యాలయంలో బహుమతి ప్రదానం జరిగింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 'ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలుస్తుంది?' ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కూపన్లను పూరించి పాఠకులు పంపించారు. వీటిలో 15 స్థానాలు కూటమి గెలుస్తుందని అంచనా వేస్తూ పెద్ద సంఖ్యలో కూపన్లు వచ్చాయి. వీటిని జూన్ 5న లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. వీరిలో మొదటి విజేత గడియాకుల శ్రీనివాసరావు తరఫున శ్రీదేవి రూ.10 వేలు, ద్వితీయ విజేతలుగా మద్దిపాటి సుబ్బారావు, సీహెచ్ అలివేణి, చిటికెల అప్పారావులకు ఐదు వేల చొప్పున బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు అందజేశారు.

పిల్లలకు బైక్‌లు ఇచ్చారో..

ఇక జైలుకే..

అమల్లోకి కొత్త రవాణా చట్టం.. తస్మాత్ జాగ్రత్త



ద్వారకా తిరుమలలో చెలరేగిపోతున్న బాలలు

బైక్‌లు ఇస్తున్న తల్లిదండ్రులు.. పట్టని అధికారులు

మావాడు సెవన్త్ క్లాస్..
అప్పుడే బైక్ నడుపుతాడు తెలుసా ?
- ఓ తండ్రి గర్వంగా చెబుతాడు.

మా పాప నైన్త్ చదువుతోంది. నన్ను స్కూటీపై ఆఫీస్ దగ్గర డ్రాప్ చేస్తుంది.
- ఓ తల్లి సంతోషం.

పిల్లలు వయసుకు మించి ఎదిగిపోతున్నారని.. పెద్ద పెద్ద బళ్లు నడిపేస్తున్నారని తల్లిదండ్రులు సంతోష పడుతుంటారు. కానీ మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. వారు డ్రైవింగ్ ఎంత బాగా నేర్చుకున్నా.. వారి వయసు, పరిణితి వాహనాలు నడపడానికి సరిపోవని మోటార్ వెహికల్ యాక్ట్ చెబుతోంది. కాని, అన్నీ తెలిసి ద్వారకా తిరుమల మండలంలో మైనర్లు మాత్రం బైక్‌లపై రయ్‌రయ్‌మంటూ పరుగులు తీస్తున్నారు.

ద్వారకా తిరుమల, జూలై 1: ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, నిబంధనలు విధించినా.. తగ్గేదేలే అంటున్నారు.. ఇక్కడి మైనర్లు. రవాణా శాఖ రూల్స్ మార్చింది కానీ.. పిల్లల తల్లిదండ్రుల మనస్సులను మార్చలేకపోతోంది. పిల్లలకు యథేచ్ఛగా ద్విచక్ర వాహనాలను ఇచ్చేసి పట్టించుకోకపోవడంతో వారు రయ్.. రయ్‌మంటూ బైక్‌లపై హల్‌చల్ చేస్తున్నారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంతో వారి స్పీడుకు బ్రేకులు పడటం లేదు. పిల్లలను పబ్లిక్ రోడ్లపై డ్రైవింగ్‌కు అనుమతించడం ద్వారా తల్లిదండ్రులు వారి జీవితాలకే కాకుండా ఇతర వాహనదారుల జీవితాలకూ ప్రమాదం కల్గిస్తున్నారు. మైనర్‌లు బైక్ రైడ్ చేస్తే వారికి రూ.25 వేలు జరిమానా విధించాలని రవాణా శాఖ నిబంధనలను సవరించింది. వీటిని జూన్ ఒకటి నుంచి అమలు చేస్తోంది. మైనర్లు బైక్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే వారికి 25 ఏళ్లు వచ్చే వరకూ డ్రైవింగ్ లైసెన్స్‌కు అనర్హులుగా ప్రకటించారు. వాహన యజమాని రిజిస్ట్రేషన్ కార్డు (ఆర్‌సీ)ను రద్దు చేస్తారు. వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారుల తాజా ఆదేశాలున్నా.. వాటిని పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో మైనర్లు ఇష్టానుసారంగా వాహనాలను నడిపేస్తున్నారు. వీరికి బండి దొరికితే చాలు అన్నట్టుంది. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఏ1గా వాహనయజమాని, ఏ2గా బండి నడిపిన మైనరుపై కేసు నమోదు చేయాల్సి ఉంది. రహదారి భద్రతపై సుప్రీం కోర్టు కమిటీ సూచనల ప్రకారం రాష్ట్ర రవాణా అథారిటీ ఇటీవల ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ఇద్దరు వ్యక్తులూ హెల్మెట్ ధరించడం తప్పనిసరని నిబంధనలను విధించింది. హెల్మెట్ లేకుండా రైడర్స్ పట్టుబడితే వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించింది.

మోటారు వాహనాల(సవరణ) చట్టం 2019

మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లు 2019, సెక్షన్ 199(ఏ) ప్రకారం 18 ఏళ్లలోపు చిన్న పిల్లలకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులకు లేదా దాని యజమానికి మూడేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే 25 ఏళ్లు వచ్చే వరకూ డ్రైవింగ్ లైసెన్స్‌కు మైనర్లు అనర్హులుగా ప్రకటించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారికి కేంద్రం షాక్ ఇస్తూ భారీ జరిమానా విధించేలా వాహనాల చట్ట సవరణ బిల్లును సవరించింది. ఇప్పటికైనా తల్లిదండ్రులు తమ పిల్లలకు బైక్‌లు ఇవ్వడం ఆపితే వారి భవిష్యత్‌కి బంగారు బాటలు వేసినట్టే.

నూతన చట్టాల

అమలుకు శ్రీకారం

ఏలూరు క్రైం, జూలై 1: భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన చట్టాలు భారతీయ న్యాయసన్హిహిత, భారతీయ నాగరిక సురక్ష సన్హిహిత, భారతీయ సాక్ష్యా అధినయంలను జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో సోమవారం నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. జూలై ఒకటో తేదీ నుంచి జరిగే ప్రతి నేరానికి సంబంధించి ఈ కొత్త చట్టాల సెక్షన్ల ప్రకారమే కేసులను నమోదు చేస్తారు. ఒక వేళ జూలై ఒకటో తేదీకి ముందు జరిగిన నేరాలకు సంబంధించి ప్రస్తుతం ఇప్పుడు ఫిర్యాదుగా ఇస్తే పాత చట్టాలైన ఐపీసీ ప్రకారమే కేసులను నమోదు చేస్తారు. నూతన చట్టాల ప్రకారం సోమవారం నుంచే పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

సోమేశ్వరస్వామి సన్నిధిలో ఐజీ దంపతులు

భీమవరంటౌన్, జూలై 1: పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర జనార్దన స్వామిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీ అశోక్ కుమార్ దంపతులు సోమ వారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం పార్వతీ అమ్మవారిని, అన్నపూర్ణాదేవిని కూడా దర్శించుకున్నారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదం అందజేశారు. ఈవో రామకృష్ణంరాజు పాల్గొన్నారు.


ఐజీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకుడు

పొలం వేలం ఆదాయం రూ.16 లక్షల

పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానానికి చెందిన 52 ఎకరాల 79 సెంట్ల వ్యవసాయ భూమికి మూడేళ్ల కాలపరిమితికి 17 ప్లాట్లకు నాలుగో సారి టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.16 లక్షల 69 వేలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రామకృష్ణంరాజు తెలిపారు. వేలాన్ని తాడేరు ఆలయ ఈవో పీటీ గోవిందరావు పర్యవేక్షించారన్నారు.

శ్రీవారికి మొక్కు తీర్చుకున్న మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు అర్బన్, జూలై 1: రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కూటమి ప్రభుత్వం కొలువు తీరాలని తిరుమల వెంకన్నకు మొక్కుకున్నానని, సోమవారం తలనీలాలు ఇచ్చి మొక్కు తీర్చుకున్నట్టు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తెలిపారు. రాష్ట్ర పాలన గాడిలో పడి, అమరావతి పూర్తి కావాలని, పోలవరం ప్రాజెక్టు త్వరలో పూర్తి కావాలని వెంకటేశ్వర స్వామిని కోరుకున్నట్టు అంగర తెలిపారు. అనంతరం సోమవారం తెల్లవారుజామున తిరుపతిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు.


తిరుమలలో తలనీలాలు సమర్పించిన రామ్మోహన్

చిన వెంకన్నను దర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ద్వారకా తిరుమల జూలై 1: చిన్నవెంకన్నను కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. తొలిసారిగా క్షేత్రానికి విచ్చేసిన ఆమెకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. బంగారు వాకిలి గుండాలోనికి వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు కలెక్టర్‌కు స్వామి వారి శేష వస్త్రాన్ని అందించి వేద ఆశీర్వచ నాన్ని అందజేశారు. డిప్యూటీ ఈవో ఆమెకు స్వామి వారి చిత్రపటాల్ని ప్రసాదాల్ని అందించారు.


కలెక్టర్‌కి చిన వెంకన్న చిత్రపటాన్ని డిప్యూటీ ఈవో

రెండో రోజు విదేశీ నిపుణుల బృందం పర్యటన

పోలవరం జూలై 1: పోలవరం ప్రాజెక్టులో విదేశీ నిపుణుల బృందం పర్యటన రెండో రోజు కొనసాగింది. నిపుణుల బృందం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ, నివారణ, మట్టి రాతి నాణ్యతా అంశాలపై చర్చించారు. ఈ విషయాలపై పోలవరం ప్రాజెక్టు అథార్టీ, సీఎస్ఎంఆర్ఎస్, సీడబ్ల్యూసీ, వరల్డ్ బ్యాంక్, వ్యాప్కోస్, అఫ్రికన్సల్టెన్సీ, ఫ్యుగ్రో కన్సల్టెన్సీ, జలవనరుల శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. అనంతరం డయా ఫ్రం వాల్, గత వరదలకు దెబ్బతిన్న డయా ఫ్రంవాల్ ఫొటోల ఎగ్జిబిషన్, నిర్మాణ దశలు ఇతర అంశాలను సీడబ్ల్యూసీ డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్ కుమార్, సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, ఎస్ఈ నరసింహ మూర్తి, సీఎస్ఎం ఆర్ఎస్ సైంటిస్ట్ మనీష్ గుప్తా, సీడబ్ల్యూసీ డిజైన్స్ సీఈ విజయ్ శరన్ బృందానికి వివరించారు. అనంతరం కాఫర్ డ్యాంల మధ్య వైబ్రో కాంపాక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి రాజమహేంద్రవరం బయల్దేరి వెళ్లారు. మంగళవారం ప్రాజెక్టులో గైడ్ బండ్‌ను ఈ బృందం పరిశీలించనుంది.


డయా ఫ్రం వాల్‌పై నడుస్తున్న విదేశీ నిపుణుల బృందం, స్పిల్ వే ఛానల్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న గోదావరి జలాలు (ఇన్‌సెట్)

ప్రాజెక్టు వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటి మట్టం అనూహ్యంగా పెరిగింది. సోమవారం ఉదయానికి స్పిల్‌వే ఎగువన 25.700 మీటర్లు, దిగువన 15.700 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 25.750 మీటర్లు, దిగువన 14.400 మీటర్ల నీటి మట్టం నమోదైంది. అదనంగా వచ్చిన 29,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఈఈ పి.వెంకటరమణ తెలిపారు. కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొండవాగులు, ఉపనదుల నీరు ప్రాజెక్టు స్పిల్ వే 48 గేట్ల నుంచి గోదావరి దిగువకు ప్రవహిస్తుంది. దిగువ కాఫర్ డ్యాం మట్టి తరలించే వాహనాల కోసం స్పిల్ ఛానల్ వద్ద తూరలతో ఏర్పాటు చేసిన రోడ్డు మార్గానికి అధికారులు గండి కొట్టారు. నీటి మట్టం పెరగడంతో వరద నీరు పొంగి ప్రవహిస్తోంది.

ఆగని వైసీపీ నాయకుల భూ ఆక్రమణలు

10 రోజులుగా పట్టిసీమ గీతాశ్రమ నిర్వహకురాలి నిర్బంధం

పోలవరం, జూలై 1: వైసీపీ రాక్షస పాలన అంతమైనా ఆ నాయకుల భూ ఆక్రమణలు ఆగడం లేదు. పట్టిసీమ గీతాశ్రమానికి రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా స్థానిక వైసీపీ నాయకులు అడ్డుగా ఫెన్సింగ్ వేసి 10 రోజులుగా తనను గృహ నిర్బంధం చేశారని ఆశ్రమ నిర్వాహకురాలు 80 ఏళ్ల వృద్ధురాలు నందుల స్వరాజ్యలక్ష్మి సోమవారం మీడియా వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. అరవై ఏళ్ల పట్టిసీమ ఫెర్రీ రేవు సమీపంలో స్థాపించిన రామకృష్ణ గీతాశ్రమ స్థలాన్ని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తే జిల్లా కలెక్టర్‌ని ఆశ్రయించామన్నారు. అది గ్రామ కంఠం ప్రభుత్వ భూమి అని అమ్మడానికి, కొనడానికి ఎవరికీ హక్కులు లేవని కలెక్టర్ తెలిపి ఆశ్రమం నిర్వహించుకోమని సూచించారన్నారు. అయితే మండల స్థాయి వైసీపీ నేత అండదండలతో స్థానిక నాయకుడు ఆశ్రమానికి దక్షిణం వైపున కొంత భూమిని ఆక్రమించి మరొకరికి విక్రయించి, అటుగా రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా కంచె వేశాడన్నారు. పడమటి వైపు గతంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం నిర్మించడానికి పునాదులు వేసి వదిలేసిందని, కాంట్రాక్టర్ ఆ స్థలంలో ఆశ్రమ గేటుకి అడ్డుగా ఫెన్సింగ్ వేసి స్థలం తనదని వాదిస్తున్నాడని వాపోయారు. బోధకాలుతో అనారోగ్యంతో ఉన్న తనకు ఆహారం, మందులు పానీయాలు తెచ్చుకోవడానికి, సహాయం అందించే వారు రాకపోకలు సాగించడానికి మార్గం లేక పది రోజులుగా అవస్థలు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.


ఆశ్రమ నిర్వాహకురాలు స్వరాజ్యలక్ష్మికి పింఛన్ సొమ్ములు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

వైద్యులు ప్రాణ దాతలు


ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులను సన్మానిస్తున్న సీఆర్‌ఆర్ ఫార్మసీ కాలేజీ సిబ్బంది

ఏలూరు క్రైం, జూలై 1: ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎంతో మంది పేదలకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడి వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారంటూ ఫార్మసీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ పరిహీన్ మాలిక్, కె.ఆశేషా,ఎం.మనోజ్‌కుమార్ అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు ప్రభుత్వాసుపత్రి వైద్యులను దుశ్శాలువాతో సన్మానించి బహుమతులను అందజేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ఫిజిషియన్ డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఏఎస్ రామ్, న్యూరో సర్జన్ డాక్టర్ రవికుమార్‌ను సన్మానించి బహుమతులను అందించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోని వైద్యులకు బహుమతులు అందజేశారు.

జడ్పీ పీఎఫ్ ఖాతాల వివరాలు ఇవ్వండి

ఏలూరు అర్బన్, జూలై 1: జిల్లా పరిషత్ పీఎఫ్ ఖాతాలకు సంబంధించిన వివరాలను నాలుగేళ్లుగా నవీకరించకపోవడం వల్ల ఉపాధ్యాయులు తమ ఖాతాల్లో నగదు నిల్వల గురించి తీవ్ర గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర సోమవారం జడ్పీ సీఈవోకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ అభ్యర్థనపై స్పందించిన సీఈవో ఖాతాదారుల వ్యక్తిగత వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో పొందుపర్చామన్నారు. వాటిని సంబంధిత టీచర్లు పరిశీలించుకుని లోపాలుంటే సరిచేయడానికి అవకాశం కల్పిస్తున్నామని, ఈ ప్రక్రియను ముగించిన వెంటనే తుది వివరాలను ఖాతాదారులకు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారని సంఘ నాయకులు తెలిపారు. సీఈవోను కలిసిన వారిలో ప్రకాష్, రామశేషుకుమార్, ఆనంద్‌కుమార్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

వరకట్న వేధింపులపై కేసు

ఏలూరు క్రైం, జూలై 1: అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు పవర్‌పేటకు చెందిన కనిగొళ్ల శ్రీలక్ష్మి శ్రీచంద్రలేఖకు 2021లో హైదరాబాద్‌కు చెందిన విడేల నాగవెంకట సత్యగణేష్‌తో వివాహమైంది. ఆ సమయంలో రూ.ఐదు లక్షల కట్నం, సారె, ఆడపడుచు కట్నం ఇచ్చారు. ఒక ప్రైవేటు కంపెనీలో సత్యగణేష్ పని చేస్తున్నాడు. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాల్లేదంటూ అదనపు కట్నం తీసుకు రావాలని శ్రీలక్ష్మి శ్రీచంద్రలేఖను భర్త సత్యగణేష్‌తోపాటు అత్త, మామలు, ఆడపడుచులు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో బాధితురాలు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో దొంగల హల్‌చల్

ఏలూరు క్రైం, జూలై 1: ఏలూరు రూరల్ మండలంలోని మూడు దేవాలయాల్లో దొంగలు హల్‌చల్ చేసి అందిన కాడికి హుండీలను పగులగొట్టి సొమ్ము దోచుకుపోయారు. సుంకరవారితోట కనకదుర్గమ్మ దేవాలయంలో హుండీని పగులగొట్టి రూ.15 వేల నగదును అపహరించుకుపోయారని దేవూరి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాదేపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, పోలేరమ్మ ఆలయాల్లో దొంగలు ఆదివారం అర్ధరాత్రి ఈ నేరాలకు పాల్పడ్డారు. రూరల్ ఎస్ఐ రాజారెడ్డి సోమవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ పుటేజీ ద్వారా నేరస్తులను గుర్తించారు. కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.


హుండీని అపహరించిన దొంగ

పింఛన్ సొమ్ము వెంటబెట్టుకెళ్లిన ఉద్యోగి

నగదు స్వాధీనం చేసుకున్న సచివాలయ సిబ్బంది

కుక్కునూరు, జూన్ 1: మండలంలోని ఉప్పేరు సచివాలయం పరిధిలో ఓ ఉద్యోగి పింఛన్ డబ్బులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకుండా వెళ్లిపోవడం కలకలం రేపింది. దామరచర్ల పంచాయతీలో పింఛన్ పంపిణీ చేయాలని ఆ ఉద్యోగికి అధికారులు సోమవారం దాదాపు రూ.లక్ష ఇచ్చారు. కేవలం నలుగురికి మాత్రమే పింఛన్ పంపిణీ చేసి తరువాత అతడు కనిపించక పోవడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు, పోలీసులు అప్రమత్తమై దీనిపై విచారణ జరిపారు. పింఛన్ సొమ్ము పట్టుకుని ఇంటికి వెళ్లిపోయినట్లు ప్రచారం కూడా జరిగింది. కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆ ఉద్యోగి ఒక ఫంక్షన్ నిమిత్తం సొంత ఊరికి వెళ్తూ మార్గమధ్యలో ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. అయితే పింఛన్‌లు చెల్లించగా అతని వద్ద మిగిలిన నగదును స్వాధీనం చేసుకున్నట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

విద్యార్థిని బలి తీసుకున్న బెట్టింగ్‌లు

ఆగిరిపల్లి, జూలై 1: ఆత్మహత్యాయత్నం చేసిన ఆగిరిపల్లిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల మూడో సంవత్సరం చదువుతున్న నూజివీడుకు చెందిన పి.తేజ (23) అనే విద్యార్థి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బెట్టింగ్‌లకు అలవాటుపడి స్నేహితుని వద్ద అప్పు చేసి అది తీర్చలేక, తల్లిదండ్రులకు ఈ విషయం తెలిస్తే బాధపడతారని గత నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు విజయవాడ ఆస్పత్రిలో చేర్చారు. నాలుగు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచాడు.

ఆర్టీసీ బస్టాండ్‌లో భారీ చోరీ

» రూ.11 లక్షల నగదు » 400 గ్రాముల బంగారం అపహరణ

నరసాపురం, జూలై 1; నరసాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. రూ.11 లక్షల నగదు, 400 గ్రాముల బంగారం ఉన్న బ్యాగ్‌ను కొట్టేశారు. ఈ సంఘటనతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన ఒక బులియన్ వ్యాపారి గుమస్తా నగదు వసూలు, ఆభరణాల ఆర్డర్ నిమిత్తం ఉదయం పట్టణానికి వచ్చాడు. వ్యాపారుల నుంచి నగదు వసూలు చేసి, ఆభరణాల ఆర్డర్లు తీసుకొని, వాటి తయారీకి బంగారం కూడా తీసుకొని భీమవరం బయలుదేరాడు. బస్టాండ్‌కు వచ్చే సరికి మత్స్యపురి-భీమవరం బస్సు అప్పుడే ప్లాట్‌ఫాం మీద ఆగింది. బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల ఎక్కువగా ఉండడంతో సీటు దొరకదన్న ఉద్దేశంలో కిటికిలోంచి క్యాష్ బ్యాగ్ సీటుపై వేశాడు. బస్సు ఎక్కి చూసే సరికి బ్యాగు కనిపించ లేదు. వెంటనే బస్సు దిగి చుట్టు పక్కలు చూసే సరికి బ్యాగుతో పరిసర ప్రాంతాల్లో ఎవరు కనిపించ లేదు. మళ్లీ బస్సు ఎక్కి ప్రయాణిలందరి దగ్గరికి వెళ్లి వెతికాడు. ఎవరి దగ్గర బ్యాగు లేదు. విషయాన్ని గుంటూరులోని వ్యాపారికి, స్థానిక వ్యాపారులకు తెలియజేశాడు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు రూ.25 లక్షలు వరకు ఉంటుందని అంచన. అయితే రాత్రి వరకు దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. దీనిపై నరసాపురం బులియన్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్ జైన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గుమస్తా వద్ద పూర్తి వివరాలు లేవన్నారు. గుంటూరు నుంచి ప్రధాన వ్యాపారి మంగళవారం ఉదయం నరసాపురం చేరుకుంటారని తెలిపారు. పట్టణంలోని వ్యాపారుల నుంచి వసూలైన నగదు, వస్తువుల తయారీకి తీసుకున్న బంగారం అన్ని లెక్క గట్టి సంఘం తరుపున కేసు పెడతామని చెప్పారు.

నందమూరులో...

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 1: నందమూరులో ఆదివారం రాత్రి భోగాల సత్యనారాయణ ఇంట్లో దుండగులు తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణ వస్త్రాల వ్యాపారం చేస్తుంటారు. ఆయన కుటుంబం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు పని మీద వెళ్లగా ఆదివారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని రూ.లక్షా ఐదు వేల నగదు, 35 గ్రాముల బంగారం, 41 గ్రాముల వెండి దొంగిలించుకుపోయారు. సత్యనారాయణ ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టినట్టు గుర్తించి ఇంట్లో పరిశీలించగా చోరీ జరిగినట్టు నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సురేష్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

క్షీరా రామలింగేశ్వర ఆలయ ఈవోగా శ్రీనివాసరావు



పాలకొల్లు అర్బన్, జూలై, 1 : క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ముచ్చర్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఈవోగా ఉన్న యాళ్ళ సూర్యనారాయణ దిగమర్రు, పెదమామిడిపల్లి, తదితర ఆలయాల ఈవోగా వ్యవహరించనున్నారు.

పోస్టాఫీస్ పేదవాడి బ్యాంకు



పోస్టు ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌వీ సత్యనారాయణరాజు

నరసాపురం రూరల్, జూలై 1: పోస్టాఫీస్ కార్యాలయం కేవలం ఉత్తరాలు అందించడమే కాదు.. ఇది పేదవాడి బ్యాంకు కూడా అని భీమవరం పోస్టాఫీస్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్‌వీ సత్యనారాయణ రాజు అన్నారు. సోమవారం వైఎస్‌పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోస్టాఫీస్‌ను ఆయన సర్పంచ్ వైఎస్ నాగముత్యామాంబతో కలిసి ప్రారంభించారు. పోస్టాఫీస్‌లో ఖాతాలు తెరిచి సొమ్ములు దాచుకుంటే అధిక వడ్డీ వస్తుందన్నారు. ఇటు కేంద్ర ప్రభుత్వ ఇచ్చే రాయితీలు కూడా పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకన శ్రీదేవి, కుక్కల మీరయ్య, జి వెంకటేశ్వరావు, కుమార్, బాబ్జీ, టి శ్రీదేవి పాల్గొన్నారు.

ఆర్చరీలో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో మాంటిస్సోరి స్కూలు డైరెక్టరు ప్రకాశరావు

తణుకు, జూలై 1: ఇటీవల విజయవాడలో జరిగిన ఆర్చరీ పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించినట్టు మాంటిస్సోరి స్కూలు డైరెక్టరు అనపర్తి ప్రకాశరావు చెప్పారు. రాష్ట్రస్థాయి అండర్-10లో కర్రి కోమలి స్పందనా రెడ్డి కాంపౌండ్ రౌండులో వెండి పతకం, ఆళ్ళ శారద కాంపౌండులో ఆరో స్థానం, రాష్ట్రస్థాయి అండర్-10 ఇండియన్ రౌండ్‌లో సిహెచ్.హర్షద్ నాల్గో స్థానం, రాష్ట్రస్థాయి అండర్-15లో ఎన్. హంసిని రికర్వ్ రౌండు, అండర్-13 కాంపౌండు రౌండులో కె.సమీక్షా రెడ్డి వెండి పతకాన్ని సాధించినట్టు వివరించారు. వీరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను, కోచ్‌లు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

దొరగారి చెరువు వద్ద బస్టాప్

ఆకివీడు, జూలై 1:ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్న ప్రయాణికుల సమస్య తీరనుందని ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. సోమవారం అయి-భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో (పాత బస్టాండ్) జాతీయ రహదారిపైనే ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడం జరిగిందని మంగళవారం నుంచి దొరగారి చెరువు దగ్గర ఖాళీ స్థలంలో ఆర్టీసీ బస్సులకు స్టాప్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ప్రయాణికులు కూర్చోవడానికి బల్లలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ఆచంట మానవత కార్యవర్గం



ఆచంట, జూలై 1: ఆచంట మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన పాలకమండలి కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి కమ్మ సంఘం కల్యాణ మండపంలో మానవత సమన్వయకర్త బుద్దిరాజు విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించారు. మానవత మండల అధ్యక్షులుగా కుక్కల లీలా ప్రసాద్, కార్యదర్శిగా నిమ్మకాయల గంగారామ్, ట్రెజరర్‌గా తమ్మినీడి సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడుగా బొక్కా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా మానేపల్లి వెంకటేశ్వరరావు, అంజూరి శ్రీనివాస్, షేక్ ముజుబుల్ రహమాన్, ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కార్యదర్శి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మెంటే గోపికి మాతృవియోగం

భీమవరం అర్బన్, జూలై : టీడీపీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మెంటే గోపి తల్లి మంగతాయరు ఆదివారం మృతిచెందారు. ఆమె పార్థీవ దేహాన్ని పార్టీ సీనియర్ నాయకులు మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, నౌషాద్, ఎద్దు ఏసుపాదం, ఐజాక్‌బాబు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కార్పెంటర్ వర్కర్స్ కార్యవర్గం



ఆకివీడు, జూలై 1: ఆకివీడు మండల కార్పెంటర్ వర్కర్స్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా చల్లపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా పెద్దగాడి రమేశ్, కోశాధికారిగా వెంకటేశులతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రరావు ప్రమాణం చేయించారు.

స్టాప్ డయేరియా అవగాహన ర్యాలీ



మొగల్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మొగల్తూరు, జూలై 1: డయేరియాను నివారించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు దినేష్, లక్ష్మీపార్వతి కోరారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సోమవారం మొగల్తూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1 నుండి ఆగస్టు 31వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 2 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల ప్రతీ ఇంటిలోనూ 2 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు 5 జింక్ మాత్రలు ఉంచుకోవాలన్నారు. ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని ప్రతీ ఒక్కరూ సొంతంగా తయారు చేసుకునేలా ఆశా వర్కర్లు తర్ఫీదు ఇస్తారన్నారు.

ఉండి: అతిసార వ్యాధిని అరికట్టడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేశారు. పీహెచ్‌సీ వైద్య అధికారి డా.సాయిచంద్ర మాట్లాడుతూ కలుషిత నీరు, నిల్వవున్న ఆహారపదార్థాలను తీసుకోవడం వలన అతిసార వ్యాధి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామకృష్ణరెడ్డి, ఉపాధ్యాయుడు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

18 వినతులు

నరసాపురం టౌన్, జూలై 1: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్ని సకాలంలో పరిష్కరించాలని ఆర్డీవో అంబరీష్ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పదే పదే వినతులు మళ్లీ రాకుండా అధికారులు చూడాలని ఆదేశించారు.

అర్బన్ బ్యాంకు మేనేజర్‌గా మహేంద్రరాజు

నరసాపురం టౌన్, జూలై 1: పట్టణంలోని అర్బన్‌బ్యాంకు మేనేజర్‌గా బొడ్డు మహేంద్రరాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు మేనేజర్‌గా పని చేసిన ఆచారి పదవి విరమణ చేశారు. దీంతో పదోన్నతిపై మహేంద్రరాజు బాధ్యతలు చేపట్టారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను టీడీపీ నాయకులు కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, వైదాని నాగేశ్వరరావు, దొంగ రాజు బొకే అందించి అభినందనలు తెలిపారు.

డెంగీని దరిచేరనివ్వద్దు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 1: వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహర్ష ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలు డెంగీ దరిచేరకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతి, హెచ్‌ఎస్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.









భీమవరంలో దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న తోట సీతారామలక్ష్మి.. కుముదవల్లిలో కలెక్టర్ నాగరాణి.. తాడేపల్లిగూడెంలో చంద్రబాబు విగ్రహానికి బాబ్జీ పాలాభిషేకం.. మండపాకలో టీడీపీ నాయకుల పింఛన్ల పంపిణీ

పింఛన్ పండుగ

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసిన అధికారులు, కూటమి నాయకులు

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం



మొగల్తూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కొత్తపల్లి సుబ్బారాయుడు

ఆకివీడు/ఉండి/పాలకోడేరు, జూలై 1: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని సీఎం చంద్రబాబు అమలు చేయడంతో పింఛనుదారుల్లో పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆయన చెరుకుమిల్లి, అయి -భీమవరంలో అందచేసి మాట్లాడారు. పట్టణ, మండలంలో 8,761 మంది పింఛనుదారులకు రూ.5,88,52,500 ఒక్కరోజులోనే అందజేయడం మామూలు విషయం కాదన్నారు. ఒకటీ-అర మిగిలితే మంగళవారం అందచేయడం జరుగుతుందన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నౌకట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు. కాళ్ల మండలంలోని కాళ్ల, ఏలూరుపాడు, ఉండిలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు పింఛన్లు పంపిణీ చేశారు.

- వేంద్ర గ్రామంలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి నాగేశ్వరి, మండల టీడీపీ అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, మాజీ ఎంపీపీ బాల వెంకటచలపతి, మూస నయన, నల్లం సురేష్‌బాబు, మల్లుల కృష్ణ, వీరవల్లి రమణ, పాలకోడేరు సహకార బ్యాంకు మాజీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కుముదవల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్ళి పింఛన్‌లు పంపిణీ చేశారు. నాగరాణి మాట్లాడుతూ రూ.4వేల పింఛన్‌తో పాటు మూడు నెలల అరియర్స్‌తో కలిపి రూ.7వేలు నగదు ఇవ్వడం జరిగిందన్నారు. సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు, మధుసూధన్‌రాజు, బలరామకృష్ణంరాజు, గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్/మొగల్తూరు: తీరంలో సోమవారం పింఛన్‌ల పంపిణీ పండుగ వాతావరణంలో సాగింది. ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, బీజేపీ కన్వీనర్ మేకల సతీష్‌లు గొంది గ్రామంలో పింఛన్లు అందించారు. అక్కడ నుంచి పట్టణంలోని 1వ వార్డు, 8, 25వార్డుల్లోను, మండలంలోని ముస్కేపాలెం, ధర్బరేవు, పీఎంలంక గ్రామాల్లో పింఛన్లు ఇచ్చారు. కార్యక్రమంలో అగ్నికులక్షత్రీయ రాష్ట్ర కన్వీనర్ కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, కోరిపల్లి వాసు, సుభాష్, కోటిపల్లి వెంకటేశ్వరావు, ఆకన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- మొగల్తూరు 1వ గ్రామ సచివాలయంలో సబ్ కలెక్టర్ ఎం. అచ్యుత్ అంబరీష్ లబ్ధిదారులకు పింఛన్‌లు అందించారు. మొగల్తూరులోని హెలెన్ కిల్లర్ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో మొగల్తూరు జాతీయ రహదారిపై సంఘ అధ్యక్షుడు చిక్కాల నాగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజులు వేర్వేరుగా పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

భీమవరం అర్బన్/భీమవరం ఎడ్యుకేషన్: పట్టణంలోని 26, 37, 38, 6వార్డులో సోమవారం ఇంటింటికి తిరిగి వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్‌లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్ పాల్గొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి దొంగపిండి, కొత్తపూసలమర్రు, గుట్లపాడు, తోకతిప్ప, గొల్లవానితిప్ప గ్రామాలతో పాటు పట్టణంలోని బలుసుమూడిలోని వార్డులలో పింఛన్ పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, టీడీపీ సినియర్ నాయకులు మద్దుల రాము, గంటా త్రిమూర్తులు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే రామాంజనేయులు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

- బేతపూడి, తుందుర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పింఛన్‌లు అందించారు. ఆయనతో పాటు జనసేన నాయకులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆచంట/పోడూరు/పెనుగొండ: ఆచంట, కొడమంచిలి, వేమవరం, వల్లూరులో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, వైస్‌ఎంపీపీలు తాళం శ్రీనివాస్, యర్రగొప్పుల నాగరాజు, సర్పంచ్‌లు నేలపూడి బేబి, కోట సరోజిని, జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు. మండలంలోని అన్నిగ్రామాల్లో కూడా పింఛన్‌లు పంపిణీ ఒక పండుగలా జరిగింది. కొన్ని చోట్ల ఎన్టీఆర్‌విగ్రహాలకు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పోడూరు, కవిటం, గుమ్మలూరు గ్రామాల్లో కూడా ఎమ్మెల్యే పితాని పింఛన్లు పంపిణీ చేశారు.

- పెనుగొండ, సిద్ధాంతం, వడలి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నక్కా శ్యామలా సోని శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, వేంద్ర రాము, పులిగోరు రవి కుమార్, గెద్దాడ చిన్న, తానేటి శేకర్, మండా ప్రసాద్ పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి శ్రేణులు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల వద్దకు వెళ్ళి 7 వేల రూపాయలు పెన్షన్ అందజేశారు. పెనుగొండ 3 సచివాలయం వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, పితాని చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పింఛన్‌దారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గెద్దాడ చిన్న, తానేటి శేఖర్, కడిమి వెంకటేశ్వరరావు, రాపాక ఆశీర్వాదం, ఉందుర్తి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- వృద్ధాప్యంలో కొడుకులు కోడళ్ళ మీద ఆధారపడే అవ్వాతాతలు, తల్లిదండ్రులు మీద ఆధారపడే వికలాంగులకు, భర్త చనిపోయి చిన్నాచితకా ఉపాధితో దుర్భరజీవనం సాగించే వితంతు మహిళలు జీవనాన్ని ఆర్థికంగా మెరుగుపరచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పోడూరు మండలంలోని జిన్నూరు, మట్టపర్రు గ్రామాల్లో ఆయన సోమవారం పింఛన్లు అందచేశారు.

పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెంటపాడు, పడమరవిప్పర్రు తదితర గ్రామాలలో పెన్షన్ పంపిణీ చేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పుల్లా బాబి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, దాసరి సతీష్‌కుమార్, కసిరెడ్డి మధులత, వర్తనపల్లి కాశి, కొనకళ్ళ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

- ఎన్నికల హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. గొర్రెల శ్రీధర్, సజ్జా సుబ్బు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం రూరల్‌లో కూడా ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జీ. పింఛన్లు పంపిణీ చేశారు.

తణుకు/అత్తిలి/ఇరగవరం: పట్టణంలోని ఆరో వార్డులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఉదయం 5 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. వృద్ధులు, దివ్యాంగులకు స్వయంగా ఆయన అందజేశారు. మిగిలిన చోట్ల కూటమి శ్రేణులు పంపిణీ చేశాయి. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి వేల్పూరు, రేలంగి, అత్తిలి గ్రామాల్లో పెన్షన్లు అందించారు. మండపాకలో టీడీపీ నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, మారం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 22వ వార్డులో మాజీ కౌన్సిలర్ కీర్తి శివప్రసాదు, ఊద సత్యనారాయణ, సతీష్, 14వ వార్డులో మాజీ కౌన్సిలర్ చిట్టూరి సాయిబాబు, 23వ వార్డులో మాజీ కౌన్సిలర్ మల్లిన రాధాకృష్ణ, నాగళ్ళ సత్యశ్రీనివాసు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అత్తిలి మండలం గోగులమ్మపేట, ఇరగవరం మండలం రేలంగిలో ఎమ్మెల్యే ఆరిమిల్లి పింఛన్లు పంపిణీ చేశారు.

మాట నిలబెట్టుకున్నారు..

మేడిది లక్ష్మి, ఆచంట



చంద్రబాబు నాయుడు చెప్పిన మాట నిలబెట్టుకున్నాడు. ఉదయాన్నే మా ఇంటికి వచ్చి నా చేతిలో ఏడు వేల రూపాయలు ఇవ్వడంతో నా ఆనందానికి అవదులు లేవు. ప్రభుత్వం ఈ పింఛన్‌తో మా లాంటి వృద్ధులు సుఖంగా జీవిస్తాం.

నూరేళ్లు సీఎంగా ఉండాలి

కపిల వీరభద్రస్వామి, పాలకొల్లు



ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగానూ, రాష్ట్ర ముఖ్యమంత్రిగానూ నూరేళ్ళు ఉండాలి. అనారోగ్యంతో ఏపని చేయలేక పోతున్నాను. ఈ పెన్షన్ మాత్రమే నాకు ఆధారం. మందుల ఖర్చులకు సరిపోతుంది

ఆనందంగా ఉంది

దమయంతి, భీమవరం



చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తే బాగుంటుంది అనుకున్న...అలాగే వచ్చిన నెల రోజులుగా అవ్వకుండానే 7వేలు సొమ్ము ఇంటికివచ్చి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. పెన్షన్‌గా ఇంత సొమ్మువస్తుందని అనుకోలేదు.

పింఛన్ పెంపు మంచి నిర్ణయం

తోట సత్యవతి, దిరుసుమర్రు



ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నమాట నిలబెట్టుకున్నారు. వృద్ధాప్యంలో పింఛన్ కింద రూ.4వేలు అందించడం ఎంతో ఆసరాగా ఉంటుంది. ఫింఛన్ పెంచడం చాలా మంచి నిర్ణయం తీసుకున్నట్లు అయింది

పాలకొల్లు: మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తన స్వగ్రామం కాపవరంలో సోమవారం రాత్రి వృద్ధాప్య పింఛన్లను లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్ళి అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కోలాటి రాధ, మాజీ ఎంపీటీసీ పాలా విజయకుమారి, గ్రామ పెద్దలు బంగారు రాజు పాల్గొన్నారు.

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సరిపల్లె, జల్లికొమ్మర, పిప్పర, సీహెచ్ అగ్రహారం గ్రామాల్లో, గణపవరంలో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు పాల్గొన్నారు.

డాక్టర్లకు సత్కారం

భీమవరం టౌన్, జూలై 1 : డాక్టర్స్ డే పురస్కరించుకొని భీమవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లును సత్కరించారు. డాక్టర్ రాజన్ రాజు నడింపల్లి, డాక్టర్ రఘువీర్ అల్లూరి, డాక్టర్ ఐశ్వర్య భూపతి రాజు, డాక్టర్ వంశీ వంగ, డాక్టర్ గౌతమ్ సిరియాల, డాక్టర్ కృష్ణ చైతన్య బృందావనం, డాక్టర్ సంజీవ్ చిక్కాల, డాక్టర్ పులగం మధు, డాక్టర్ విక్రాంత్ చుండూరి, డాక్టర్ సందీప్ వర్మ దాట్ల, డాక్టర్ శ్వేతా మంతెన, డాక్టర్ జై కృష్ణ కిషోర్, డాక్టర్ ఆర్ రామకృష్ణంరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసి డెంట్ పేరుచర్ల మూర్తి రాజు, సెక్రెటరీ గోపిశెట్టి మురళీకృష్ణారావు, కోశాధికారి బొండాడ కుమార వెంకటరత్నం, నడింపల్లి మహేష్ కుమార్ పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం, పిప్పర ప్రభుత్వ ఆసుపత్రిలో పీఎంపీ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేని ఘనంగా నిర్వహించారు. పిప్పర ప్రభుత్వ వైద్యాధికారి ప్రియాంకను, గణపవరం ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్ నాయుడు, కిరణ్మయిలను ఘనంగా సత్కరించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో పీఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల అధ్యక్షుడు ఎం.సత్యనారా యణమూర్తి, ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు, కార్యదర్శి శివశ్రీనివాసరావు, కోశాధికారి అప్పారావు పాల్గొన్నారు.

పెనుగొండ: విద్యార్థులు చిన్నతనం నుంచి బాగా చదువుకుని భవిష్యత్తులో దేశానికి సేవ చేసే విధంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్‌కలిదిండి రామచంద్రరాజు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం పెనుగొండకు చెందిన భాష్యం స్కూలు



తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో వైద్యులకు నర్సింగ్ విద్యార్థినుల సత్కారం

విద్యార్థులు డాక్టర్ రామచంద్రరావును, అలాగే ఆసుపత్రిలో ఉన్న సిబ్బందిని, కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నున్నా ఆనంద్ అధ్యక్షతన సుబ్బారావుపేటలోని ప్రసాద్ హాస్పిటల్స్‌లో డాక్టర్ శోభారాణిని సత్కరించారు. జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ఏరియా ఆసుపత్రి వైద్యులను సత్కరించారు.

తణుకు: శ్రీనిధి ఆసుపత్రిలో సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అధ్యక్షతన డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల సేవలను కొనియాడారు. అనంతరం వైద్యులు బంగారు రమేష్ కుమార్, వీర వెంకట ప్రకాష్, పాహిం తదితరులను సన్మానించారు.

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బృందావన్ హాస్పటల్స్ డాక్టర్లు డాక్టర్ వర్మ, డాక్టర్ మానసలను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు రావాడ సతీష్, జవ్వాజి కళ్యాణ్, పోతాబత్తుల సత్యనారాయణ, ముత్యాల శ్రీనివాస్, ఇమ్మిడి రాజేష్, మైగాపుల రాంబాబు, జక్కంపూడి రాంప్రసాద్ ఉన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలు నిలుపుదల చేయాలి

నరసాపురం, జూలై 1: కేంద్ర ప్రభుత్వం సోమవారం నుంచి అమల్లోకి తీసుకొచ్చిన కొత్త చట్టాలను తక్షణం నిలుపుదల చేయాలంటూ నరసాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు గేట్ వద్ద న్యాయవాదులు ఆందోళన చేశారు. వీటిని వ్యతిరేకిస్తూ విధుల్ని బహిష్కరించారు. బార్ అధ్యక్షుడు దానయ్యనాయుడు మాట్లాడుతూ హడావుడిగా ఈ చట్టాలను అమలు చేయడం వల్ల న్యాయప్రక్రియకు విఘాతం కలుగుతుందన్నారు. న్యాయ నిపుణులు, మేధావుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా క్రిమినల్ చట్టాలను మార్చడం సరికాదన్నారు. ఈ చట్టాల్లో పలు లోపాలు ఉన్నాయన్నారు. దీనిపై తాము అందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

నరసాపురం- మచిలీపట్నం రైల్వే లైన్ చేపట్టాలి



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను కలిసిన డాక్టర్ చినమిల్లి

నరసాపురం, జూలై 1: బ్రిటిష్ హయాంలో ప్రతిపాదనలో ఉన్న నరసాపురం- మచిలీపట్నం రైల్వేలైన్ పనుల్ని చేపట్టాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మను సోమవారం వైఎన్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ కోరారు. భీమవరంలో మంత్రిని కలిసి ఈ రైల్వేలైన్ ఆవశ్యకతను వివరించారు. గతంలో నరసాపురం- విశాఖపట్నం మధ్య ఉన్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలని, రాత్రి పూట నడిచే నరసాపురం- మచిలీపట్నం- విశాఖ లింకు రైలు రెగ్యులర్‌గా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునికోటి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలసిన ఆర్టీసీ యూనియన్ నాయకులు

భీమవరం టౌన్, జూలై 1 : ఆర్టీసీలో ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు సమస్యలు, ఇబ్బందులు గాని ఉంటే తనదృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈయూ జోనల్ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌పి రాజు, జోనల్ మెంబర్ అరుణ, ఈయూ జిల్లా కార్యదర్శి అల్లం నారాయణ, జిల్లా మెంబర్ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరుకు ఎమ్మెల్యే రఘురామ అభినందనలు



ఉండి, జూలై 1: జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణిని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరుతో జిల్లాలో అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లా కేంద్రంలోని పరిస్థితులను చర్చించారు.

సీసీ రహదారికి శంకుస్థాపన

పెంటపాడు, జూన్ 1: ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పడమరవిప్పర్రులో రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించే అంతర్గత సీసీ రహదారికి శంకుస్థాపన చేసి మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో ఏ కాంట్రాక్టర్ ఏ పనిచేయాలన్నా లంచం ఇవ్వాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం రహదారి వేస్తున్న కాంట్రాక్టరు కూడా ముందుకు రాకపోతే అతనికి భరోసా కల్పించి సుమారు రూ. 25 లక్షలు పెట్టుబడి పెట్టి పనులు ప్రారంభించామన్నారు. అనంతరం ఆంజనేయస్వామిని, సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

భవన నిర్మాణ కార్మికుల కార్యవర్గం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 1: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్. అగ్రహారంలో సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దంగేటి నారాయణరావు, గౌరవ సలహాదారుగా పాలూరి సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడిగా దెయ్యం రంగారావు, కార్యదర్శిగా కామిరెడ్డి కృష్ణ, కోశాధికారిగా మంచాల ఏసు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 1: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి దానవప్రసాద్ డిమాండ్ చేశారు. మోదుగగుంటలో భవన నిర్మాణ కార్మిక సంఘ సర్వసభ్య సమావేశం సోమవారం యూనియన్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సమస్యలపై చర్చించారు. నాయకులు పి. వీరబ్రహ్మం, కె. పోసేంద్ర ప్రసాద్, అంగర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగం అజరామరం

భీమవరం టౌన్, జూలై 1 : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశం కోసం చేసిన త్యాగం అజరామరమని, ధైర్యానికి సాహసానికి ప్రతీక అల్లూరి అని అల్లూరి సీతారామ రాజు సేవా సమితి కార్యదర్శి చెరుకువాడ సుబ్రహ్మణ్య రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లూరి జయంతి ఉత్సవాలను సోమవారంనాడు ప్రారంభించారు. యువజన సంఘం సమాఖ్య అధ్యక్షుడు కాంతేటి వెంకటరాజు మాట్లాడుతూ అల్లూరు ఒక కారణ జన్ముడని, అలుపెరగని అల్లూరి వీర పోరాటం దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని అన్నారు. ముందుగా జేఎల్‌బి హైస్కూల్ నుంచి అల్లూరి విగ్రహం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ హెచ్‌ఎం బి.శ్రీనివాస్, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ బాలచందర్ కవితాలాపన



పెనుగొండ, జూలై 1: తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాల కవి సమ్మేళనంలో ప్రముఖ కవి, గాయకుడు ఎస్‌వీకేపీ అండ్ వీవీ జూనియర్ కళాశాల తెలుగు విభాగపతి డాక్టర్ బాలచందర్ పాల్గొని కవితాలాపన చేశారు. పడమటి పొద్దులు (పదవీ విరమణ వేళ) అంశానికి మధురంగా ఆలపించి వీక్షకులను ఆనందపరిచారు. అధ్యక్ష, కార్యదర్శులు పక్కి రవిశేఖర శర్మ, మాణిక్యాలరావులు బాల చందర్‌కు ప్రశంసా పత్రం అందజేసినట్లు తెలిపారు.

రిటైర్డ్ ఎస్ఐ సీతారామయ్య మృతి



పాలకొల్లు, జూలై 1 : నాగరాజు పేటకు చెందిన విశ్రాంత ఎస్ఐ మేరువు సీతారామయ్య (84) సోమవారం ఉదయం ఆయన నివాసంలో స్వల్ప అనారోగ్యంతో మరణించారు. సీతారామయ్యకు ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఆయన కుమారుడు ఎంఎన్‌వి సాంబశివరావు ప్రెస్‌క్లబ్‌కు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. మరో కుమారుడు హోమ్‌గార్డు సీసీగా పనిచేస్తున్నారు. సీతారామయ్య మృతి పట్ల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ నాయకులు పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరునాయుడు, స్థానికులు వీరా సత్యం, అంబటి శేషగిరి, మిరియాల నాని, గుమ్మాలూరి శాస్త్రి, అప్పారావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

35 మంది యువకుల రక్తదానం

తణుకు, జూలై 1: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సోమవారం క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థతో పాటు 35 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. క్లబ్ సభ్యులు డాక్టర్ వెంకటరాజు, గమిని రాంబాబు, వంగూరి హనుమంతరావు, బసవా రామకృష్ణ, అక్కిన కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.